# సురేఖ

పబ్లిక్ గార్డెన్ లాన్స్‌లో పచ్చగడ్డి మీద – నిప్పుల మీద కూర్చున్నట్లుగా కూర్చున్నాడు రమేష్. సాయంత్రం ఆరుగంటల ఐదు నిమిషాలు. సురేఖ సరిగ్గా ఆరుగంటలకి వస్తానంది. సురేఖ అన్నమాట తప్పదు. చాలా పంక్చువల్. తను ఐదున్నరకే వచ్చి కూర్చున్నాడు. సురేఖ యింకా రాకపోవటం ఆశ్చర్యంగా ఉంది. ఐదు నిముషాలు ఐదు యుగాల్లా గడిచాయి... సురేఖతో తనివ్వాళ్ళ చాలా విషయాలు మాట్లాడాలి. తన హృదయంలో ఆమెమీద పొంగిపొర్లే ప్రేమను ఆమెకి తెలియజెయ్యాలి... కాని... ఏమిటోగాని ఆమెతో మాట్లాడబోతే తనకసలు మాట పెగలదు. "నిన్ను ప్రేమిస్తున్నాను సురేఖా! గాఢంగా నా హృదయమంతటితో – నిన్ను చూడకుండా – నీలో శాశ్వతంగా ఐక్యమవకుండా బ్రతకలేను, నువ్వే నా జీవితానికి ధ్యేయం–లక్ష్యం–పరమార్థం. ఇలా ఆమెతో చెప్పాలనీ ఎన్నిసార్లు అనుకున్నాడో! కాని చెప్పలేకపోయాడు. ఎందుకో అలా చెప్పటం తనకి ఎబ్బెట్టుగా ఉంటుంది. ముఖ్యంగా సురేఖతో అలా చెప్పటానికి తనలో ఏదో జంకు. సురేఖ ఎప్పుడూ నిండుగా, పరిపూర్ణంగా ఉంటుంది. ఎప్పుడూ తొణకదు, తడబడదు. ఎక్కువగా మాట్లాడదు. ఆ మాట్లాడింది చాలా అర్థవంతంగా, సందర్భోచితంగా ఉంటుంది. సురేఖలో ఉండే ఆ నిండుతనమే తనకెంతో నచ్చింది.

సురేఖ సెక్రటేరియట్‌లో స్టెనోగా పనిచేస్తోంది. రెండు మూడు నెలల క్రితమే చేరింది. ఆమెని చూసిన మొదటి క్షణంలోనే తనకి ఆమెపట్ల ప్రేమ జనించింది. తను ఎంతకాలంగానో అన్వేషిస్తున్న తన స్వప్నసుందరి తనకోసం ఏ దేవలోకం నుండో దిగివచ్చినట్లనిపించింది. వెంటనే ఆమెనిగూర్చి తెలిసికున్నాడు. సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న తన మిత్రుడిద్వారా ఆమెను పరిచయం చేసుకున్నాడు. అతిత్వరలో ఆమెకు చాలా దగ్గరగా వెళ్ళగల్గాడు.

సురేఖ అందంలో యేదో దైవత్వం ఉన్నట్లనిపించింది తనకి. ఆమె, అందంలో ఎంతో నిండుతనం. క్రొంగొత్తతనం, అప్పుడే పూసిన పువ్వులాంటి నిర్మలత్వం, ఫ్రెష్‌నెస్ ఉన్నాయి. తను చాలామంది అందమైన ఆడవాళ్ళను చూశాడు. కాని వాళ్ళ అందంలో తనకేదో వెలితి కన్పించింది. కాని సురేఖని చూడగానే తను యిన్నాళ్ళు సురేఖకోసమే – ఇలా బ్రహ్మచారిగా ఉన్నాననిపించింది. ఇన్నేళ్ళ తన తపస్సు ఫలించినట్లుగా ఫీలయ్యాడు.

రమేష్, ఎకౌంటెంట్ జనరల్ ఆఫీసులో యు.డి.సి.గా పనిచేస్తున్నాడు. తండ్రికి బాగా ఆస్తి ఉంది. వొక్కడే కొడుకు. ఉద్యోగం కేవలం ఉబుసుపోకకు.

హైదరాబాద్‌ని వదల్లేక చేస్తున్నాడు. రెండు మూడేళ్ళుగా నాన్న తనకోసం ఎన్నో సంబంధాలు చూశాడు. తనకెవరూ నచ్చలేదు. తను త్వరగా ఒక ఇంటివాడు కావాలని ఎంతో ఆదుర్దాగా వున్నారు - అమ్మానాన్నలు. త్వరలోనే వాళ్ళ కలల్ని నిజం చెయ్యబోతున్నాడు. సురేఖలాంటి అమ్మాయి తమ కోడలుగా రాబోతున్నదని తెలిస్తే ఉబ్బి తబ్బిబ్బైపోతారు. వెంటనే పెళ్ళికి ఏర్పాటు చేసేస్తారు.

సురేఖకి త్వరలోనే తనంటే ఒక 'యిది' ఏర్పడింది. తనూ ఆమె కలిసి సినిమాలకి వెళ్ళారు, పిక్‌నిక్‌లకి వెళ్ళారు. హాయిగా మాట్లాడుకున్నారు. సురేఖకి నాఅన్నవాళ్ళెవరూ లేరుట. చాలా పేద కుటుంబంలో పుట్టిందట. కేవలం తన స్వయం కృషి వల్ల యెన్నో కష్టాలకోర్చి స్టెనో కాగల్గిందట.

దూరంగా సురేఖ మెఱపులా మెరిసింది. సురేఖ వస్తోంది. రిస్టువాఛీ చూసుకున్నాడు. ఆరు పది. పదినిముషాలు లేటు... సురేఖ నెమ్మదిగా నడిచి వస్తోంది. దివి నుండి భువికి దిగిన అప్సరసలా... లేత గులాబి రంగు చీర, అదేరంగు జాకెట్ - ఎప్పుడూ సింపుల్‌గా అలంకరించుకుంటుంది సురేఖ. ఆ అందానికి కారణం ఆ సింప్లిసిటీ. సురేఖ తనని చూసింది. తనవేపుగా నడిచి వస్తోంది. తనని సమీపించింది. చిన్నగా, అందంగా నవ్వింది.

"ఐయామ్ సారీ రమేష్ - పది నిమిషాలు ఆలస్యం" అంది సురేఖ తియ్యగా.

"పది నిమిషాలు పది యుగాలుగా గడిచాయనో! మీ ఆఫీసర్ రాక్షసుడు. యే డిక్టేషన్ యిస్తూనో డీటైన్ చేసాడనుకున్నాను"

"అబ్బే! ఆయనివ్వాళ్ళ మూడుగంటలకే వెళ్ళిపోయాడు"

ఇద్దరూ లాన్‌మీది గడ్డి మీద కూర్చున్నారు.

"ఇప్పుడేంచేద్దాం సురేఖా! ప్లాజాలో మంచి పిక్చరుంది - వెడదామా!"

"యేం పిక్చర్లండీ - చెత్త - ఊరికే ఇలా ఉండిపోతేనే హాయిగా ఉంది"

"పోనీయ్ అలాగే చేద్దాం. మొదలు అలా తాజ్‌మహల్ దాకా వెళ్ళి కాఫీ తాగుదామా?"

"ఏమీ అక్కర్లేదు బాబూ! ఇంట్లో కాఫీ తాగే బయిల్దేరాను"

రమేష్ కొంచెం నిరుత్సాహపడ్డాడు. సురేఖతో తాజ్‌కి వెళ్ళి, ఫామిలీ సెక్షన్‌లో కూర్చుని, కాఫీ సిప్ చేయ్యాలని అతని సరదా.

కాస్సేపు ఇద్దరిమధ్య నిశ్శబ్దం. ఎలక్ట్రిక్ దీపాలు వెలిగాయి. లాన్స్ నిండా గుంపులు గుంపులుగా మంది చేరారు. ఆ గుంపుల్లో అక్కడక్కడ కన్నులపండుగగా జంటలు. చాలా ఆహ్లాదంగా ఉంది వాతావరణం. అందరికీ కొంచెం దూరంగా ఒక పూలపొద మాటున కూర్చున్నారు రమేష్, సురేఖలు. సురేఖతో యెన్నో మాట్లాడాలను కున్నాడు... కానీ ఎలా మొదలెట్టాలో అర్థం కావటంలేదు.

"సురేఖా!" అన్నాడు.

"ఊ! చెప్పండి" అంది సురేఖ దూరంగా లాన్‌మీద ఆడుకుంటున్న ఇద్దరు పిల్లల్ని చూస్తూ. తను కూడా అటు చూసాడు. నిజంగా ఆ ఇద్దరు పిల్లలు చాలా ముద్దొస్తున్నారు. తనకి, సురేఖకి అలాంటి పాపలు పుడతారా? తప్పకుండా– తను అందమైనవాడు, సురేఖ అందమైంది. తమకు పుట్టే పాపలు తప్పకుండా అక్కడ ఆడుకుంటున్న పాపలకంటే అందంగా వుంటారు....

చెవులు గింగురుమనేలా కూసుకుంటూ పోయింది నాంపల్లి స్టేషన్ నుండి వస్తున్న ట్రెయిన్.

"అబ్బ! ఎంత అసహ్యకరమైన చప్పుడు" అంది సురేఖ చిరాగ్గా.

మళ్ళీ కొంతసేపు నిశ్శబ్దం. సురేఖ అటే ఆ పిల్లలకేసి చూస్తోంది.

"సురేఖా!"

"ఏమిటి? చెప్పండి" అంది తన వైపుకు తిరిగి.

"ఆ పిల్లలు చాలా ముద్దొస్తున్నారు కదూ... శ్రీ420 సినిమాలో 'ప్యార్‌హువా' పాటలో పుట్‌పాత్ మీద కనిపిస్తారే ఇద్దరు పిల్లలు అలా ఉన్నారు"

"ఔను, చాలా ముద్దొస్తున్నారు" అంటూ సురేఖ మళ్ళీ అటుతిరిగింది. సంభాషణ తెగిపోయింది. యేం మాట్లాడాలో తెలియటం లేదు.

"టైమ్‌పాస్ బఠాణీ – టైమ్‌పాస్ బఠాణీ సార్" అంటూ బఠాణీల వాడొకడొచ్చాడు. బఠాణీలు కొన్నాడు. సురేఖ చేతిలో కొన్ని పోసాడు. ఇద్దరూ బఠాణీలు నములుతున్నారు. తన బుర్రలోకి ఎన్నెన్నో మాటలు, వాక్యాలు అస్పష్టంగా మెదిలి వెళ్ళిపోతున్నాయి.

"ఇవ్వాళ్ళ నీతో చాలా విషయాలు మాట్లాడాలనుకున్నాను" అన్నాడు.

"ఊ! మాట్లాడండి" అంది సురేఖ. ఎక్కడికో, యే దూరతీరాలవైపో చూస్తూ. అలా చూసినప్పుడు సురేఖని తన హృదయం మీదికి తీసికోవాలనిపిస్తుంది. గాఢంగా తన హృదయానికి హత్తుకోవాలనిపించింది. ఎన్నేళ్ళుగానో, ఎన్ని యుగాలుగానో అనుభవిస్తున్న దాహాన్ని సురేఖ పెదవులతో తీర్చుకోవాలనిపించింది. కాని ఎందుకో సురేఖకి ఎంత దగ్గరగా వెళ్ళాలని ప్రయత్నించినా అందుకు సాహసించలేకపోతున్నాడు. తనని వొకవేపు దగ్గరగా రానిస్తూనే దూరంగా ఉండమని శాసించే శక్తి యేదో సురేఖలో ఉంది. ఆమెలో తనలో కన్పించే ఆవేశం, పొంగులువారే ప్రేమ కన్పించవు. ఈ ప్రాపంచిక శక్తులకు అతీతమైనదేదో ఆమెలో ఉందనిపిస్తుంది.

గడ్డిమీద పడుకున్నాడు. ఆకాశంకేసి చూస్తున్నాడు. సురేఖ మెల్లిగా వొకటి తర్వాత వొకటి... బఠాణీలు నములుతోంది. సురేఖతో ఈరోజు తను మాట్లాడ

దల్చుకున్నదేదీ మాట్లాడలేకపోతున్నాడు. తను ఆమెతో చెప్పదల్చుకున్నది వొకటే విషయం "నిన్ను గాఢంగా ప్రేమించాను. పెళ్ళి చేసుకుంటాను" అని. అంతే! దట్సాల్. కాని ఆ రెండు మాటలే తన గుండెల్ని చీల్చుకొని గొంతునుండి విడివడి రావటం లేదు.

"ఏమిటో ఆలోచిస్తున్నారు" అంది సురేఖ తనవైపు తిరిగి తనమీదికి వంగుతూ. వెంటనే అతని రక్తం ఉప్పొంగింది. సురేఖని తనమీదికి, తన హృదయం మీదికి లాక్కోవాలని పించింది. తన కౌగిట్లో నలిపివేయాలనిపించింది. అలా చేస్తే యేం చేస్తుందో?

"నిజంగా- యేం ఆలోచిస్తున్నానో చెప్పమంటావా?" ఆమెకి యింకా దగ్గరగా వచ్చి అడిగాడు. ఆమెకూడా అతనికి యింకా దగ్గరగా వచ్చి అతని ముఖంలో ముఖం పెట్టి

"చెప్పండి... ప్లీజ్ చెప్పండి" అంది.

"ఏమీ అనుకోవుగా"

"ఏమీ అనుకోను. ప్లీజ్ చెప్పండి"

సురేఖని తనమీదికి లాక్కొన్నాడు. గాఢంగా తన హృదయానికి హత్తుకున్నాడు. వెంటనే సురేఖ తనని విడిపించుకొని బయటపడింది. అతని నరనరాల్లో వెర్రి ఆవేశం ఉప్పొంగింది. రక్తం వేడెక్కి వెర్రిగా ప్రవహించింది. మరుక్షణంలో అంతా అయిపోయింది.

"అలా నిన్ను నా హృదయం మీదికి లాక్కొంటే యేం చేస్తావని ఆలోచిస్తున్నాను" అన్నాడు తేలికగా నవ్వటానికి ప్రయత్నిస్తూ. సురేఖ మాట్లాడలేదు. క్షణంసేపు నిశ్శబ్దం.

"తప్పు చేసానా సురేఖా! సారీ. నువ్వలా భావిస్తే..."

"వొక్కసారి మీరు తాకినంత మాత్రాన నా శరీరం మైలపడిపోలేదు లెండి. నేనేమీ అనుకోను" అంది స్పష్టంగా సురేఖ.

"అదికాదు సురేఖా! మనిద్దరి మధ్య ఈ దూరం ఎంతకాలం చెప్పు- ఎంత కాలం యిలా..."

సురేఖ ఏమీ మాట్లాడలేదు. ఏదో వెర్రి ఆవేశం అతనిలో ప్రవేశించింది.

"సురేఖా! నిన్ను ప్రేమిస్తున్నాను. గాఢంగా... నా హృదయమంతటితో... నువ్వు లేనిది బ్రతకలేను- ఒక్కక్షణం కూడా. మనిద్దరం వెంటనే పెళ్ళి చేసుకుందాము. యేమంటావు. ఈమాట నీతో చెప్పాలని నెల రోజులుగా నాలో నేనే స్ట్రగులవుతున్నాను" చెప్పేశాడు. గుండెల భారం తగ్గింది.

"నిజంగానా రమేష్? నన్ను ప్రేమిస్తున్నారా?" నమ్మలేనట్లుగా ధ్వనించింది సురేఖ గొంతు.

"నమ్మలేవా సురేఖా? నా అంతరాత్మ సాక్షిగా చెబుతున్నాను- నిన్ను ప్రేమిస్తున్నాను. నీకోసం యేం చెయ్యమన్నా చేస్తాను. యే త్యాగమైనా, ఎన్ని కష్టాలైనా... కాని... కాని నువ్వు లేకుండా... నిన్ను చూడకుండా బ్రతకలేను. నిన్ను చూసిన మొదటి క్షణం నుండి నా హృదయం నీకోసం తపిస్తోంది. ఎందుకో... నిన్ను చూడగానే నాకు నువ్విదివరకే నాకు తెలుసుననిపించింది. ఎక్కడో, ఎప్పుడో, యే పూర్వజన్మలోనో మనిద్దరమూ వొకటే. యే శాపం వల్లనో విడిపోయాము. ఆనాటి నుండి నీకోసం వెదుకుతున్నాను. ఈనాటికి లభించావు. నా జన్మ ధన్యమైంది" ఆవేశంగా చెప్పుకుపోయాడు... సురేఖ వింతగా నవ్వింది. తన మాటలన్నీ బూటకమన్నట్టుగా, ఉత్త కోతలన్నట్లుగా- భరించలేకపోయాడు. సురేఖని నలిపివెయ్యాలన్నంత కోపం, కసి జనించాయి.

"నమ్మలేవా సురేఖా! నా మాటలన్నీ కోతలనుకుంటున్నావా? చెప్పు... చెప్పు నిన్నెలా నమ్మించను. యేం చేస్తే నీకు నమ్మకం కల్గుతుందో చెప్పు... ప్లీజ్... చెప్పు..." సురేఖ భుజాలు పట్టుకొని గట్టిగా కుదుపుతూ అడిగాడు.

"ప్రేమించటం అంత సులభం అంటారా?" అంది సురేఖ.

"అంటే... నాకర్థం కాలేదు".

"మీకు నాకూ పరిచయమై మూడు నెలలు కూడా దాటలేదు. ఇంత స్వల్పకాలంలో..."

"ప్రేమ వొక్కక్షణంలో... అరక్షణంలో జనిస్తుంది. నిన్ను చూసిన మరుక్షణంలో నీమీద నాకు ప్రేమ కల్గింది"

"అలా అరక్షణంలో జనించిన ప్రేమ ఎంతకాలం ఉంటుందంటారు. అంత త్వరలో మీకు నామీద ప్రేమ కల్గటానికి యెన్నో కారణాలుండవచ్చు. బయటకు కన్పించే నా బాహ్య సౌందర్యం కావచ్చు. మీకు నచ్చినవేవో కొన్ని నాకు ఆపాదించి అవి నాలో ఉన్నాయని మీరు భ్రమించి ఉండవచ్చు. నేనింకా యేమిటో మీకు తెలియదు. మీరేమిటో నాకు తెలియదు. వొకర్నొకరం బాహ్యంగా మాత్రమే తెలిసుకున్నాము. నేనే- నాలోనే ఉన్న యెన్నో లోపాలను అర్థం చేసుకున్నానని చెప్పలేను. అలాంటిది మిమ్మల్ని అర్థం చేసుకున్నానని ఎలా అనుకోను? అలాగే మీరుకూడా నన్ను అర్థం చేసుకున్నారని ఎలా చెప్పగలరు. సంపూర్ణంగా వొకర్నొకరం అర్థం చేసుకోకుండా ప్రేమించుకుంటే ఆ ప్రేమ ఎంతకాలం నిలుస్తుంది?" అంది ఎక్కడా తొణక్కుండా- స్పష్టంగా-

ఆక్షణంలో సురేఖంటే భలే అసహ్యం వేసింది. సురేఖ వొక మనిషి అనిపించలేదు. మనుష్యుల్ని అతినిశితంగా పరిశీలించే ఒక ఎక్స్‌రే యంత్రం సురేఖ.

అతి సహజమైన సరళమైన విషయాన్ని అనవసరంగా తన గొప్పని చూపించుకోవటానికి కష్టతరం, క్లిష్టతరం చేస్తోంది సురేఖ. మళ్ళీ ఆవేశంలో కొట్టుకుపోయాడు రమేష్.

"నువ్వు చెప్పేది యేదీ నా విషయంలో నిజంకాదు. నిన్ను అర్థం చేసుకున్నాను. సంపూర్ణంగా అర్థం చేసుకున్నాను. అర్థం చేసుకోవటానికి సంవత్సరాలు గడపాల్సిన అవసరం లేదు. వొక్కక్షణం చాలు - స్త్రీ పురుషులు ప్రేమించుకోవటం అతి సహజం సురేఖా! ఆ అతిసహజమైన మానవ తత్వాన్ని నువ్వేదో చెప్పి కాదంటున్నావు. నువ్వెన్ని సిద్ధాంతాల్ని చెప్పినా నిన్ను నేను ప్రేమించాననే సత్యాన్ని కాదని ఋజువు పరచలేవు. సిద్ధాంతాలతో నా ప్రేమను కొలవొద్దు- ప్లీజ్..."

బొంగురుపోతున్న గొంతుతో అన్నాడు. కాస్సేపు నిశ్శబ్దం. లాన్స్‌లో జనం పలుచబడ్డున్నారు.

"అయితే నేను చాలా అదృష్టవంతురాల్ని రమేష్. నీ ప్రేమని పొందగల్గటం కంటె..." మెల్లగా అంది సురేఖ.

"చెప్పు సురేఖా! మనిద్దరం వెంటనే పెళ్ళి చేసుకుందామా? మావాళ్ళకి రాయమంటావా?" ఆతురతగా అడిగాడు.

"ప్రేమకి, పెళ్ళికి అంత సంబంధం ఉందంటారా? కేవలం ప్రేమికులుగానే ఉండిపోలేమంటారా?" పరధ్యానంగా ఎటో చూస్తూ అంది సురేఖ.

"చాలా చిత్రంగా మాట్లాడతావ్ సురేఖా! పెళ్ళి చేసుకోకుండా మనం ఎలా హాయిగా భార్యాభర్తల్లా ఉండగలం... పెళ్ళి చేసుకోకుండా అలా తిరిగితే లోకం ఊరుకుంటుందా? మనమీద స్కాండల్స్ చెప్పుకోరు? అసలు పెళ్ళిచేసుకోకుండా... మనకి సంసారం... పిల్లలు... ఎలా ఉంటారు" అన్నాడు.

సురేఖలో మళ్లీ అదేనవ్వు... వింతగా, తనని గేలి చేస్తున్నట్లుగా, తను ఉత్త అమాయకుడన్నట్లుగా నవ్వింది.

"అంటే లోకానికి భయపడి, లోకం కోసం పెళ్ళన్నమాట. మనకోసం కాదు. మనకోసం మనం బ్రతకటంలేదన్నమాట" అంది సురేఖ.

సురేఖ తనబుద్ధి పోనివ్వలేదు. అసలు సురేఖకి చాలా తలబిరుసు. అందరికంటే తాను అధికురాల్ని అనే గర్వం. అందుకే అలా ప్రత్యేకంగా మాట్లాడుతుంది.

"అదికాదు సురేఖా! పెళ్ళి చేసుకోకుండా మనిద్దరం... ఎలా... ఎలా... ఐమీన్... ఎలా కాపురం చెయ్యటం... ఐమీన్..."

"మీరు యేం చెప్పదల్చుకున్నారో నాకర్థమయ్యింది. వొక విషయం స్పష్టంగా ఒప్పుకుంటే యే పేచీ లేదు. మనిద్దరికీ- స్త్రీ పురుషులుగా- వొకరిపై వొకరికి కోరిక- ఆ కోరికనే ప్రేమ అనుకొని మనం మనని మోసగించుకుంటున్నాము"

మళ్లీ అతనిలో కట్టలు త్రెంచుకున్న ఆవేశం. బాగా రెచ్చిపోయాడు. సురేఖ రెండు భుజాలు పట్టుకొని గట్టిగా ఊపేస్తూ...

"నో! నో! నో! సురేఖా! ఐలవ్‌యూ... ఐసే ఐలవ్‌యూ... నన్నింక ఉడికించకు. నిన్ను పెళ్ళి చేసుకొమ్మని అడగను... అలానైనా నిన్ను ప్రేమిస్తున్నాననే నమ్మకం నీకు కల్గితే... అంతేగాని... నిన్ను నేను ప్రేమించటం లేదంటే... నీమీద కేవలం కోరిక మాత్రమే ఉందంటే... భరించలేను. అలా అని నా హృదయాన్ని కోతపెట్టకు..." అన్నాడు.

"ఐయామ్ రియల్లీ సారీ రమేష్... మిమ్మల్ని అంత బాధపెట్టినందుకు నన్ను క్షమించండి" అంది సురేఖ రమేష్ చేతులు పట్టుకొని.

ఇద్దరూ కాస్సేపు అలా ఉండిపోయారు. లాన్స్‌లో జనం ఎవ్వరూ లేరు. ఇద్దరూ నిశ్శబ్దంగా బయటకు నడిచారు.

*　　　*　　　*

ఆ తెల్లారే రమేష్‌కి పోస్టులో ఒక కవరు- విప్పాడు. అందమైన సురేఖ దస్తూరి. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి... ఆత్రంగా చదివాడు.

డియర్ రమేష్!

నిన్నరాత్రి మిమ్మల్ని చాలా బాధపెట్టాను. మళ్ళీ అడుగుతున్నాను- క్షమించమని. కాని ఈ ఉత్తరం మిమ్మల్ని యింకా బాధిస్తుందేమో!

కొందరి జీవితాలు మల్లెతోటలు- నందనవనాలు కావు. కఠోరకంట కావృతాలు. అందరూ హాయిగా జీవించాలనుకునేవారే- కాని ఎందరో అలా జీవించలేరు. అడుగడుగునా వంచించబడతారు. జీవితం వాళ్ళ పాలిట భయంకర స్వప్నం అవుతుంది. నా గత జీవితం అలాంటి ఒక భయంకర స్వప్నం.

నేను చాలా పేద కుటుంబానికి చెందినదాన్నని మీకు తెలుసు. నా చిన్నప్పుడే మా నాన్న చనిపోయాడు. ఎన్నో కష్టాలు, నానా అగచాట్లు పడి మా అమ్మ నన్ను మా ఊర్లో ఉన్న హైస్కూల్లో చదివిస్తుండేది. నేను పదో తరగతిలో చేరేటప్పటికి పెద్దదాన్నయిపోయాను. వెంటనే మా ఊర్లో నా చదువుని గూర్చిన చర్చ చెలరేగింది. యుక్తవయస్సు వచ్చినా యింకా ఈ అమ్మాయిని చదివించటం ఘోరమైన అపరాధమని ఆ ఊరి పెద్దల నిర్ణయం. పైగా నేను రోజూ రెండు మైళ్ళ దూరం నడిచి వెళ్ళాలి. త్వరలోనే ఆ ఊర్లో చాలామంది కళ్ళు నామీదే ఉన్నాయని తెలుసుకున్నాను. ఐనా చదువు మానకూడదని నా దృఢ నిశ్చయం. మా దూరపు బంధువొకామె హైదరాబాద్‌లో మంచి ఉద్యోగంలో ఉంది. ఎలాగో నేను హెచ్.యస్.సి. ప్యాసైతే యేదైనా ఉద్యోగం

చూసిపెడతానంది. ఎన్ని అవమానాలకోర్చైనా చదువు సాగించాలని అమ్మతోకూడా వప్పించి చదువు సాగిస్తున్నాను. అలాంటి నా జీవితంలోకి తుఫానులా వచ్చాడు మోహన్.

మోహన్ మా ఊర్లో బాగా ధనవంతుడైన రాఘవరావు కుమారుడు. హైదరాబాద్‌లో బి.ఏ. చదువుతున్నాడట. ఒకరోజు స్కూల్‌కెడ్తున్న నన్ను చూశాడు. అంతే! నా వెంట పడ్డాడు. ప్రేమించానన్నాడు, పెళ్ళి చేసుకుంటానన్నాడు. ప్రేమలేఖలు రాశాడు. హైదరాబాద్ నుండి నాకు యేవేవో గిఫ్ట్స్ పంపించటం మొదలెట్టాడు. వెంటనే మా ఊర్లో మా యిద్దరి మీద పుకార్లు పుట్టాయి. మా ఇద్దరి పేర్లు గోడలమీదికెక్కాయి. ఐతే మోహన్ అందరి ముందు ధైర్యంగా చెప్పాడు- నన్ను ప్రేమించానని, పెళ్ళిచేసుకో బోతున్నానని తండ్రితో కూడా పోరాడాడు. నన్ను తప్ప ప్రపంచంలో ఎవర్ని పెళ్ళాడనన్నాడు. ఇల్లు విడిచి పారిపోతానన్నాడు. మోహన్ తండ్రి మొదలు మా వివాహానికి అంగీకరించలేదు. కాని మోహన్ పట్టుదల చలించకపోవటం చూసి మా పెళ్ళికి ఒప్పుకున్నాడు. కాని ఒక షరతుమీద... మోహన్ బి.ఏ. నేను హెచ్.ఎస్.సీ ప్యాసయ్యాకే మా పెళ్ళి జరుగుతుంది. ఊరి పెద్దలంతా సరేనన్నారు.

ఇలా జరుగుతుండగా ఒకరోజు స్కూలు నుండి తిరిగి వస్తున్నాను. సాయంకాలం- ఐదు దాటింది. త్వరత్వరగా నడిచి వస్తున్న నా వెనకాల "సురేఖా" అన్న పిలుపు విన్పించింది. వెనక్కి తిరిగి చూసాను. అప్పుడే బస్సు దిగి పట్నం నుండి వస్తున్నాడు మోహన్.

"ఇప్పుడే ఇంటికెళ్ళి యేం చేస్తావ్. అలా ఆ మామిడితోటలో కాస్సేపు కూర్చొని వెడదాము పద. నీకోసం యేమేం తెచ్చానో చూద్దువుగాని" అన్నాడు మోహన్. అతని కోరికను కాదనలేకపోయాను కాదనటానికి కారణం కూడా కన్పించలేదు. త్వరలో పెళ్ళిచేసుకోబోతున్నాము కదా!

మామిడితోటలోకి వెళ్ళాము. దట్టంగా నిర్మానుష్యంగా ఉంది తోట. సూట్‌కేస్ తెరిచాడు మోహన్. నిజంగా నాకు చాలా తెచ్చాడు. అందులో నాకు ఎంతో నచ్చిన చీర, జాకెట్‌కూడా ఉన్నాయి. అప్పుడే అక్కడే ఆ చీర జాకెట్ వేసికోమని బలవంతం చేసాడు మోహన్. కాదనలేకపోయాను. వేసుకున్నాను.

ఆ కొత్త దుస్తుల్లో... అతనిముందు ఆ వాతావరణంలో నిల్చోవటం... ఇద్దరమూ యేయే లోకాలకో తేలిపోయాము. చందమామ వెన్నెల కురిపించి మమ్మల్ని రెచ్చగొట్టాడు. ఇద్దరమూ మైమరచిపోయాము. ఎక్కడో రక్తం అడుగున నిద్రిస్తున్న కోరికలు ఒక్కసారి మేల్కొన్నాయి. మాకు తెలియకుండానే- మా నిమిత్తం లేకుండానే-

ఒకరి కౌగిల్లో ఒకరం- ఆ తర్వాత యేం జరిగిందో- మీరే ఊహించుకోండి. అతనికి ఆరోజు అలా నన్ను నేను అర్పించుకున్నాను.

ఇక తర్వాత కథ మామూలే. మోహన్ ఆ సంవత్సరం చక్కగా బి.ఏ. ఫెయిలయ్యాడు. నా కారణంగానే తన కుమారుడు ఫెయిల్ అయ్యాడని, నేను ఆయన కోడలుగా వస్తే తన యిల్లు, సంసారం సర్వనాశనమౌతుందున్నాడు మోహన్ తండ్రి. తర్వాత కొద్దిరోజులకు ఒక యేబైవేల కట్నంతో మోహన్ పెళ్ళి నిర్ణయమైపోయింది.

ఆ సంవత్సరమే నేను హెచ్.ఎస్.సి. ప్యాసయ్యాను. కాని నా పెళ్ళికాని దిగులుతో కన్నుమూసింది మా అమ్మ. నేను ఎలాగో హైదరాబాద్ చేరి ఈ టైపు, షార్ట్‌హాండ్ నేర్చుకొని ఉద్యోగంలో చేరిపోయాను.

డియర్ రమేష్! ఇదీ నా గత చరిత్ర. మీ నుండి నా గత జీవితాన్ని దాచేసి మిమ్మల్ని మోసగించటం ఇష్టం లేదు. ఎప్పుడో అప్పుడు నా గతం బయటపడి మన ఇద్దరి జీవితాలూ కల్లోలమయమవక తప్పదు.

ఇప్పుడు కూడా మీరు నన్ను ప్రేమిస్తే నిజంగా ధన్యురాల్ని. మీ ఉత్తరం కోసం ఎదురుచూస్తూ...

మీ

సురేఖ

ఆ ఉత్తరం చదవడం పూర్తిచేసేటప్పటికి రమేష్ కళ్ళకి చీకట్లు కమ్మాయి. తన కళ్ళని తాను నమ్మలేకపోయాడు. అంతా ఏదో కుట్ర, దగా, మోసం- తననెవరో నిర్దాక్షిణ్యంగా, ఘోరంగా మోసగిస్తున్నారు. సురేఖ ఆ ఉత్తరం రాయలేదు. ఎవరో తన శత్రువులు, తనని సర్వనాశనం చెయ్యాలను కునేవాళ్ళు ఆ ఉత్తరం రాసారు. అప్పుడే పూసిన పువ్వు సురేఖ అనుకున్నాడు. అపూర్వ సౌందర్యజ్యోతితో ప్రకాశించే సురేఖ- వెళ్తూ వెళ్తూ ఈ లోకంలో సూర్యుడు మఱచిపోయి, విడిచిపోయిన సంధ్యాకిరణం సురేఖ- ఇంపాజిబుల్, ఇంపాజిబుల్- అంతా కట్టుకథ. పీడకల. భళ్ళున తెల్లవారుతుంది. నిజం బయటపడ్తుంది... కాని ఇది కలకాదు- కలకాదు-నిజమే. తన చేతిలో సురేఖ రాసిన ఉత్తరం. తనకు తెలిసిన సురేఖ దస్తూరి "ఒకరి కౌగిట్లో ఒకరం – ఆ తర్వాతేం జరిగిందో మీరే ఊహించుకోండి" ఊహించుకోలేదు. ఊహించి బతకలేదు. సురేఖ-తనకోసం-కేవలం తనకోసం అప్పుడే పూసిన పువ్వు అనుకున్నాడు. లేదు. ఆ పువ్వు తనకోసం పూయలేదు. ఆ పువ్వును ఇదివరకే మోహన్ అనే రాక్షసుడు పీల్చి పిప్పిచేశాడు. నలిపి పారవేశాడు. వోగాడ్! సురేఖ! అంత నిండుగా, నిర్మలంగా, స్వచ్ఛంగా, ఫ్రెష్‌గా కన్పించే సురేఖలో ఇంత బడబానలం దాగుందా. ఒక క్షణం

ముందు తనకి తెలిసిన సురేఖకి, ఇప్పటి సురేఖకి ఎంత బేధం. ఆ సురేఖ తన ఆరాధ్యదైవం. ఆమెకోసం తన సర్వస్వాన్ని త్యాగం చెయ్యటానికి సిద్ధపడ్డాడు. కానీ అదే సురేఖ- ఇప్పుడు.. ఇప్పుడు సురేఖ దేవతకాదు- తన శరీరాన్ని సిగ్గులేకుండా పరాయివాడికి అర్పించిన పతిత. భ్రష్టురాలు. పతితను ప్రేమించేంత సూపర్‌మ్యాన్ కాదు తను. తను మామూలు మానవుడు. తనకి పెద్ద పెద్ద ఆదర్శాలు లేవు. 'అరక్షణంలో జనించిన ప్రేమ ఎంతకాలం వుంటుందని సవాల్ చేసింది సురేఖ- ఇందుకేనేమో. సురేఖ ఎప్పుడూ అలా నిగూఢంగా మాట్లాడటంలోని అర్థం ఇప్పుడు తెలుస్తోంది. సురేఖ తనని శంకించింది. మోసగించింది. ఎండమావి లాంటి తన సౌందర్యం చూపి, రెచ్చగొట్టి ఇప్పుడు పరిహసిస్తోంది. "ఇప్పుడు కూడా ప్రేమిస్తే ధన్యురాల్ని!" ఎంత జిత్తులమారి. సురేఖ అందాన్ని చూసి మోసపోయాడు. నిజంగా సురేఖ అందమైందే. సురేఖ అందం తనకి కావాలి. తన జీవితంలోకి గొప్ప జ్యోతిని, సౌందర్యాన్ని ప్రకాశాన్ని తెస్తుంది సురేఖ- సురేఖ జగదేక సౌందర్యంలో తన జన్మ చరితార్థమౌతుంది. సురేఖ తనకి కావాలి... సురేఖ లేకుండా బ్రతకలేడు... కానీ... కాని సురేఖ అందం మైలపడిపోయింది. సురేఖ అనాఘ్రాత పుష్పం కాదు. "ఆ తర్వాతేం జరిగిందో మీరే ఊహించుకోండి" ఊహించుకోకుండా ఉండలేకపోతున్నాడు. పుష్పం మీద వాలిన తుమ్మెదలా సురేఖ మీదపడి, సురేఖ సౌందర్యాన్ని పీల్చుకుంటున్న మోహన్... ఆ దృశ్యాన్ని ఊహించుకున్నాడు. జుట్టు పీక్కున్నాడు. తల బాదుకున్నాడు.

తర్వాత రెండురోజుల్లో రమేష్‌కి పిచ్చెక్కినంత పనైంది. మూడోరోజు పెళ్ళిచూపులకి రమ్మని ఇంటినుండి ఉత్తరం వచ్చింది. వెంటనే వెళ్ళాడు. పిల్ల నచ్చిందన్నాడు. త్వరలోనే రమేష్ పెళ్ళి వైభవంగా జరిగిపోయింది.

'జయశ్రీ' మాసపత్రిక *(జూలై, 1971)*

(నేపథ్యం : ఈ కథను కూడా నేను ఉస్మానియాలో ఎం.ఏ. చదువుతున్న రోజుల్లోనే రాశాను. ఒక మిత్రుడు తానో అమ్మాయిని ప్రేమించానని, అయితే తన ప్రేమ నిజమో కాదో తెలుసుకోవడానికి ఆ అమ్మాయి తనకో పరీక్ష పెట్టిందని, ఆ పరీక్షలో తాను ఓడిపోయానని చెప్పాడు. అతడు చెప్పిన ఈ సంఘటన ఆధారంగా నేనీ కథను రూపొందించాను.)